RNI. No. APTEL/2011/41055

EMI Available CLASSIC EMI Available
COMPUTERS and XEROX SHOP
IB-Chowk,Main Road Utnoor-9652790005
Laptop , Computers , Printers, CC Cameras
all Accessories
hp DELL lenovo SAMSUNG acer

# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక

Prop: Syed inkeshaf ali
BAJAJ FINSERV
Call : 9490916775,9652790005
CLASSIC COMPUTERS & XEROX ELECTRONICS

సంపుటి : 13 సంచిక : 266 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 29 మార్చి 2025 | పేజీలు : 4 | వెల : 2/-




## నానాటికి పెరుగుతున్న...

# రేవంతుడి గ్రాఫ్....!

## పార్టీ - ప్రభుత్వంపై తనదైన శైలిలో పట్టు!

## అసెంబ్లీలో అదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డి!!

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మేం కక్షపూరిత రాజకీయాలు చేయాలనుకుంటే కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారని అన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారని చెప్పారు. డ్రోన్ ఎగరవేశానని ఎంపీని అయిన నా మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500 జరిమానా వేసే కేసులో జైలులో పెట్టి వేధించారని ఆరోపించారు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిలుపై వచ్చి వెళ్లానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నేను కూడా అలా ప్రతీకార రాజకీయాలు చేయదలిస్తే ఇప్పటికే కొందరు జైలులో ఉండేవారని పేర్కొన్నారు.

కేటీఆర్, కేసీఆర్‌కు జైలులో డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కట్టించి ఇస్తానని అన్నానని చెప్పారు. కానీ అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్ష రాజకీయాలు చేసే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. కేటీఆర్, కేసీఆర్‌ను జైలులో వేయాలని చాలామంది మమ్మల్ని అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారని గుర్తు చేశారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదని ఆరోపించారు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్ల రుణమాఫీ చేశారని చెప్పారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8500 కోట్లు పైగా అయ్యిందని వివరించారు. మేం అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే రూ.26 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని రైతుబంధు కూడా వేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎగవేసిన రైతుబంధు రూ.7625 కోట్లు మేం చెల్లించామని చెప్పారు. వరి వేస్తే ఉరే అని స్వయంగా సీఎం బెదిరించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## 1500 ఎకరాల్లో...

# బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ..



బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఈసారి హన్మకొండ జిల్లాలో నిర్వహించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభను హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించబోతున్నారు. శుక్రవారం సభ మైదానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. సభ నిర్వహణకు అనుమతినివ్వాలని కాజీపేట ఏసీపీకి దరఖాస్తు చేశారు. సభ నిర్వాహణకు సంబంధించి భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ ఇతర అనుమతులు మంజూరులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏసీపీని కలిసిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, సతీష్ బాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి తదితరులు ఉన్నారు. వరుస ఓటముల నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లోని నైరాశ్యాన్ని తొలగించేందుకు భారీ స్థాయిలో రజోత్సవ వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నిర్ణయించారు. ఏప్రిల్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో ప్లీనరీ నిర్వహించాలని, 27న వరంగల్‌లో సుమారు ఐదు లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు అనుసంధానంగా, అనువుగా ఉండే ఎల్కతుర్తిని ఎంపిక చేశారు. 1500 ఎకరాల్లో సభ నిర్వహించబోతున్నట్లు సమాచారం.

## సీఎం రేవంత్ రెడ్డి ఎందుకా మాట అన్నారు? వ్యూహంలో భాగమా?

హైదరాబాద్ : ఏంటా ధైర్యం? ఎందుకలా మాట్లాడారు? తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టుండి అంత మాట అనేశారేంటి? ఆయన మనసులో ఏముంది? వాళ్ళకు ధైర్యం చెప్పే మాటలా? లేక అంతకు మించిన వ్యూహమా?.. అసలింతకీ ఏమన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి? ఆయన మాటల చుట్టూ ఓ రేంజ్‌లో చర్చ ఎందుకు జరుగుతోంది? ఇవే.... అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి నోటి నుంచి వచ్చిన ఈ మాటలే ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చనీయాంశం అయ్యాయి. ఇటు సొంత పార్టీ, అటు ప్రతిపక్షాలు ఈ మాటల మీదే స్పెషల్ ఫోకస్ పెట్టి చర్చోప చర్చలు చేసేస్తున్నాయి. అసలు ఏ ధైర్యంతో ఆయన ఆ మాటలు అన్నారు? పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాబోవని అంత కాన్ఫిడెంట్‌గా సభ సాక్షిగా ఎలా చెప్పగలిగారు? అసలు ఆయన వెనక వ్యూహం ఏంటి..అని మాట్లాడుకుంటున్నారు అన్ని పార్టీల నాయకులు. ఉప ఎన్నికలు రావు... ఎందుకు వస్తాయని ఒక వ్యూహం ప్రకారమే ఆయన సభలో ప్రశ్నించారా అన్న వ్యాఖ్యలు సైతం వినిపిస్తున్నాయి. తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడెందుకు వస్తాయంటూ కౌంటర్ ఇచ్చారు సీఎం. ఎవ్వరూ ఆందోళన పడాల్సిన పనిలేదు. ఉప ఎన్నికలు రావని భరోసా ఇచ్చారాయన. దాంతో రేవంత్ రెడ్డి మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు స్పందించారు. కోర్టులో ఉన్న వ్యవహారంపై సీఎం కామెంట్ చేయడం సరికాదని, సభలో ఆయన అన్న మాటల్ని సుప్రీంకోర్టులో చూపిస్తామని చెప్పారు హరీష్. అయితే అందుకు కూడా క్లారిటీ ఇచ్చేశారు ముఖ్యమంత్రి. తాను కోర్టును ఉద్దేశించి మాట్లాడలేదని,ఉప ఎన్నికలు వస్తాయంటూ ఓ పార్టీ నాయకుడు చేస్తున్న ప్రచారం గురించి మాత్రమే మాట్లాడానని క్లారిటీ ఇచ్చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా... అసలు సీఎం అంత కాన్ఫిడెంట్‌గా ఉప ఎన్నికలు రావని ఎలా చెప్పగలిగారంటూ ఆరాలు తీయడం మొదలైపోయింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కొందరు కాస్త అసంతృప్తితో ఉన్నారని, తిరిగి సొంత గూటికి వెళ్తారని ఓ ప్రచారం జరుగుతోంది. దీన్నే అనుకూలంగా మల్చుకుంటున్న ప్రతిపక్షం... ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు




వస్తాయని, గుణపాఠం చెప్పడం ఖాయమంటూ వాయిస్ పెంచుతోంది. దాని కౌంటర్‌గానే... బైపోల్స్ జరగబోవని సీఎం అన్నట్టుగా విశ్లేషిస్తున్నారు కొందరు. పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఆందోళన కలిగించేలా విపక్షం వ్యూహం పన్నిందని, కానీ.... అంత సీన్ లేదంటూ... తమ పక్షాన చేరిన వారికి భరోసా ఇచ్చే ప్రయత్నంలో భాగంగానే ఆ కామెంట్స్ చేసి ఉండవచ్చని చెప్పుకుంటున్నారు.

దీనికి తోడు... గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను విలీనం చేసుకోవడం, పార్టీ ఫిరాయింపులపై అప్పట్లో ఫిర్యాదు చేసిన లెక్కచేయకుండా వ్యవహరించిన బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టడం కోసం కూడా అలా మాట్లాడి ఉండవచ్చంటున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అదసలు సమస్యే కాదన్నట్టు వ్యవహరించిన గులాబీ నేతలు ఇప్పుడు మాత్రం అంతకు మించిన సమస్య వేరొకటి లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వైఖరిపై చర్చ పెట్టేందుకే సీఎం అలా మాట్లాడి ఉండవచ్చన్నది ఇంకో వెర్షన్. బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరిని మరోసారి జనం ముందు పెట్టడం, ఒక్కో పార్టీకి.... ఒక్కో న్యాయమా అనే అంశం మీద మాట్లాడుకునేలా చేసే వ్యూహం కూడా ఉందని అంటున్నారు. మొత్తం మీద అటు పార్టీ మారిన ఎమ్మెల్యేలకు భరోసా ఇవ్వడం, ఇటు ప్రతిపక్షం వైఖరిని ఎండగట్టడం లాంటి బహుళ ప్రయోజన టార్గెట్‌తోనే రేవంత్‌రెడ్డి అలా మాట్లాడి ఉండవచ్చంటూ విశ్లేషిస్తున్నారు పొలిటికల్ పండిట్స్.

# ఆఖరి ప్రయత్నాల్లో ఆశావహులు!

## మంత్రి పదవుల వేటలో.. హస్తిన బాట..!!



హైదరాబాద్ : తెలంగాణ కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంత్రి పదవుల కోసం ఆశావహులైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీ బాట పట్టారు. మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలన్న దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిందని చెబుతున్నా.. ప్రయత్నిస్తే పోయేదేముంది? అనుకుంటూ ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలను కలిసి మంత్రి మండలిలో ప్రాతినిధ్యం కోసం ఎవరి తిప్పలు వారు పడుతున్నారు. తెలంగాణ కేబినెట్‌లో ప్రస్తుతం ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. విస్తరణలో భాగంగా ఎంతమందికి అవకాశమిస్తారన్నదానిపై స్పష్టత లేకపోయినా పదవుల కోసం ఆశావహులు పదుల సంఖ్యలోనే ఉన్నారు. వారు మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు ఒక్కొక్కరుగా ఢిల్లీ చేరుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిందే తడవుగా ఢిల్లీ విమానం ఎక్కేశారు. ఒకరు తర్వాత ఒకరు వరుసగా ఢిల్లీకి క్యూ కట్టారు. దీంతో రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలు దేశ రాజధానికి మారినట్లయ్యింది. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బాలునాయక్ ఢిల్లీకి చేరుకుని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లను కలిశారు. ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఢిల్లీకి బయలు దేరారు. అహ్మదాబాద్ లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీ(డ్రాఫ్టింగ్ కమిటీ) సమావేశానికి భట్టి హాజరుకానున్నారు. మరోవైపు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం ఢిల్లీలోనే ఉన్నారు. మంత్రివర్గంలో స్థానం కోరుతున్న కాంగ్రెస్ మాదిగ, లంబాడీ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు సైతం తమ ప్రయత్నాలు చేసేందుకు ఢిల్లీకి పయనమయ్యారు. మరి హస్తిన చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఎవరి ప్రయత్నాలు ఫలించి అమాత్యులయ్యే అదృష్టవంతులెవరన్నది ఏప్రిల్ 3వ తేదీలోగా తేలిపోనుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మూడోసారి యోగీ సీఎం అవుతారా ?

ఉత్తరప్రదేశ్ లో 2017లో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. అది కూడా 400కి పైగా అసెంబ్లీ సీట్లు ఉన్న అసెంబ్లీలో మూడొంతుల మెజారిటీ సాధించింది. దాంతో బీజేపీకి తిరుగులేదు అని అంతా అనుకున్నారు. ఇక యూపీ సీఎం అభ్యర్థులుగా ఆనాడు ఎంతోమంది అతిరథ మహారథులు ఉన్నారు. కానీ బీజేపీ అధినాయకత్వం అనూహ్యంగా అప్పటికి ఎంపీగా ఉన్న యోగీ ఆదిత్యనాథ్ ని ఎంపిక చేసింది. అలా ఆయన దేశంలో అతి పెద్ద రాష్ట్రం అయిన యూపీకి సీఎం అయ్యారు. ఆయన చూస్తే యోగి యూపీని ఎలా పాలిస్తారు అన్న డౌట్లు అందరిలో ఉన్నాయి. కానీ బుల్డోజర్ సీఎం గా యోగీ తొందరలోనే తన మార్క్ చాటుకున్నారు. అక్రమార్కుల మీద బుల్డోజర్ అంటూ ఆయన కొత్త స్టైల్ పాలిటిక్స్ కి తెర లేపారు. తొలి అయిదేళ్ళలోనే సీఎం గా ఆయన పాతుకుని పోయారు. ఇక 2022లో జరిగిన ఎన్నికల్లో సీట్లు తగ్గినా యోగీ తన ఇమేజ్ తో యూపీలో బీజేపీని గెలిపించారు అన్న ప్రచారం అయితే సాగింది. ఈ రోజున దేశంలో చూస్తే సొంత ఇమేజ్ కలిగిన బీజేపీ ముఖ్యమంత్రులు పెద్దగా కనిపించరు. అది ఒక్క యోగీ విషయంలో మాత్రమే వేరుగా ఉంది. ఆయన సొంతంగా పలుకుబడి కలిగిన వారుగా పేరు తెచ్చుకున్నారు. ఆయన కనుక జనంలోకి వెళ్తే పెద్ద ఎత్తున జనాలు వస్తారు. ఆయన పేరు యూపీలో మారుమోగుతూ ఉంటుంది. పాలన మీద ఆయన ముద్ర బాగా ఉంది. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం కానీ ఇటీవల ప్రయాగ్ రాజ్ లో జరిగిన ప్రపంచ స్థాయి అతి పెద్ద ఆధ్యాత్మిక జాతర మహా కుంభమేళా కానీ యోగీ ఖాతాలోనే క్రెడిట్లుగా పడ్డాయి. లా అండ్ ఆర్డర్ కూడా ఆయన కంట్రోల్ లో పెట్టారు. పాలన మొత్తం తన కనుసన్ననలోకి తెచ్చుకున్నారు. ఒక విధంగా చూస్తే అటు ఆరెస్సెస్ మద్దతు తో పాటు బలమైన హిందూత్వ వాణితో యోగీ జాతీయ స్థాయిలో బీజేపీకి తిరుగులేని నాయకుడిగా ఉన్నారు. మోడీ తప్పుకుంటే యోగీయే ఆల్టర్నేషన్ అని అంతా అనుకునే నేపథ్యం ఉంది. ఈ క్రమంలో ఆ మధ్య ఇండియా టూడే కాంక్లేవ్ లో యోగీ భవిష్యత్తు రాజకీయాల గురించి ప్రశ్న ఎదురైనపుడు మళ్ళీ మఠానికే అని జవాబు చెప్పి సంచలనం రేపారు యూపీ సీఎం. యూపీకి 2027లో ఎన్నికలు జరగబోతున్నాయి. బీజేపీ అక్కడ బలంగా ఉంది. మళ్ళీ గెలవాలని అంటే యోగీ ఫేస్ తోనే వెళ్లాలి. యోగీనే సీఎం అభ్యర్థిగా ప్రాజెక్ట్ చేయాలి. కానీ యోగీ మాత్రం తన మఠం తన ఆధ్యాత్మికం అని అంటున్నారు. ఇదే రాజకీయ చర్చ అనుకుంటే తాజాగా ఆయన సీఎం గా ఎనిమిదేళ్ళు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ఈ తరహా అభిప్రాయాలనే వెలిబుచ్చారు. యూపీలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుంది అని ఆయన ధీమాగా చెప్పారు. యూపీని మళ్ళీ పాలించేది బీజేపీ సీఎం నే అని మాత్రమే యోగీ అన్నారు. అంతే తప్ప తానే హ్యాట్రిక్ సీఎం అని అనలేదు. దాంతోనే ఇది హాట్ డిస్కషన్ గా మారుతోంది. ఫిఫ్టీ ప్లస్ ఏజ్ లో ఉన్న యోగీ పొలిటికల్ గా యంగ్ లీడర్ అని చెప్పాలి. అత్యంత ప్రజాదరణ ఉన్న సీఎం గా ఆయన పేరు ఉంది బీజేపీ మళ్ళీ గెలిస్తే ఆయనకే కదా చాన్స్ అని అంతా అనుకుంటున్న వేళ యోగీ ఈ విధంగా అంటున్నారు అంటే ఆయనలు రాజకీయాల మీద ఆసక్తి తగ్గిందా లేక ఆయనను కాకుండా బీజేపీ పెద్దలు వేరే వారిని సీఎం గా పెట్టాలని అనుకుంటున్నారా లేక యోగి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారా అన్న సందేహాలు అందరిలో కలుగుతున్నాయి. ఏది ఏమైనా ఎవరు అవునన్నా కాదన్నా బీజేపీలో మోదీ తరువాత యోగీకే ఎక్కువ మంది సపోర్టు ఉంది. ఆయనే బీజేపీని జాతీయ స్థాయిలో లీడ్ చేయగలరని అంతా బలంగా నమ్ముతున్నారు. యోగీ తాను మఠానికే అని అన్నా ఆయనను మాత్రం కాషాయం నేతలు కానీ ఆరెస్సెస్ కానీ వదిలే సమస్య లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. యోగి యూపీకి మూడోసారి సీఎం అవుతారా లేదా అన్నది భవిష్యత్తు చెబుతుంది.

# 3.5 లక్షల దరఖాస్తులు..300 లోపు పరిష్కారం



హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నత్తను తలపిస్తోంది. ఏడు జిల్లాలు ఆరు జోన్ల పరిధిలో 3.5 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో ఇప్పటివరకు 300 దరఖాస్తులలోపే పరిష్కరించి ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు తెలుస్తోంది. మార్చి 31వ తేదీలోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇవ్వనుండటంతో చాలామంది ముందుకు వస్తున్నారు. ప్రక్రియ వేగంగా సాగకపోవడంతో వెనక్కి తగ్గుతున్నారు. సాంకేతిక సమస్యలు పెద్ద అడ్డంకిగా మారుతున్నాయని హెచ్ఎండీఏ సిబ్బందే చెబుతున్నారు. ఎల్ఆర్ఎస్‌తో భారీ ఆదాయం సమకూరుతుందని భావించిన అధికారులకు నిరాశే ఎదురవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఎల్ఆర్ఎస్‌పై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా డైరెక్టర్లు, పీవోలు సరైన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో సమీక్ష కూడా జరగడం లేదు. ఎల్ఆర్ఎస్, వివిధ సమస్యలపై వస్తున్న దరఖాస్తుదారులను హెల్ప్ డెస్క్ నుంచి అధికారుల వద్దకు పంపుతున్నారు. అయితే అక్కడ ఎవరూ కలవడం లేదని వారు వాపోతున్నారు. దీంతో రూ.లక్షలు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. కొందరైతే తర్వాత చూద్దాంలే అని విరమించుకుంటున్నారు. ఇప్పటివరకు 5 శాతం మంది కూడా ఫీజులు చెల్లించలేదని ఓ అధికారి తెలిపారు.

**స్పష్టత ఎక్కడ?**

ఫీజు చెల్లించిన తర్వాత ఎప్పటిలోగా ప్రొసీడింగ్స్ ఇస్తారో అధికారులు చెప్పలేకపోతున్నారు. ఫలితంగా చాలామంది ముందుకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఒకే సర్వే నంబరు, పక్కపక్కనే ఉన్న ప్లాట్లకు సంబంధించి వేర్వేరుగా ప్రభుత్వ మార్కెట్ ధరలు ఉంటున్నాయి. ఒక చోట చదరపు గజం రూ.300 ఉంటే.. పక్కనే ఉన్న ప్లాటు చదరపు గజానికి రూ.15-20 వేలు చూపుతుండటంతో అవాక్కవుతున్నారు. మార్కెట్ ధర భారీగా ఉంటే...వాటిపై చెల్లించే ఎల్ఆర్ఎస్ ఫీజులు ఎక్కువగా ఉంటాయి. దీంతో డబ్బులు కట్టడానికి సిద్ధపడటం లేదు. ఆరా తీస్తే...సాంకేతిక సమస్యలే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. వాటిని సరిచేసే ప్రయత్నం చేయడం లేదు. కొన్ని దరఖాస్తులకు ఎల్-1 పెండింగ్ అని చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించి అక్కడ ఎలాంటి నీటి వనరులు లేవని తేల్చిన తర్వాతే ఎల్-1కు క్లియరెన్సు వస్తుంది. ఇప్పటికే దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్‌కు పంపినా అక్కడ పట్టించుకునే నాథుడు ఉండటం లేదు. మాస్టర్‌ప్లాన్‌లో తప్పుల వల్ల మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారు.

# స్వచ్ఛత మరిచె.. మురుగు నిలిచె



పరిగి : జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పాలక వర్గం గత జనవరిలో ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుండగా పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరత తదితర కారణాలతో పారిశుద్ధ్య పనులు సక్రమంగా సాగడంలేదు. దీంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. తడి, పొడి చెత్త వేరుచేయడం లేదు. మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. స్వచ్ఛత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉంటే స్వచ్ఛతో ర్యాంకు ఎలా సాధించగలమని పౌరులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 'పరిశీలన' కథనం

**దశాబ్దాలనాటి కాలువలే నేటికీ దిక్కు**

వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకించి వార్డు అధికారులను నియమించింది. కానీ వారు కార్యాలయ పనులకే పరిమితం కావడంతో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. ఓవైపు రోజు రోజుకు జనాభా పెరుగుతున్నా అన్ని మున్సిపాలిటీల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన మురుగు కాల్వలే నేటికీ ఆధారంగా నిలిచాయి. దీంతో చాలా చోట్ల మురుగు నిలిచి పోతోంది. పరిగిలో ప్రధానంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణ కేంద్రానికి సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో పారబోస్తున్నారు.

**పేరుకే జిల్లా కేంద్రం**

వికారాబాద్ పట్టణ కేంద్రంలో నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు తిరుగుతుంటారు. అలాంటిది రోడ్ల వెంబడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉంటున్నా సిబ్బంది తొలగించడంలేదనే విమర్శలున్నాయి. సగం సిబ్బంది లేకపోగా ఉన్న వారిలో కొందరు ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికీ కార్మికులు తక్కువగానే ఉన్నారు.

**డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బంది**

మున్సిపల్‌లోని గాంధీనగర్ కాలనీకి సమీపంలో చించోళి,భూత్పూర్ జాతీయ రహదారి పక్కనే చెత్తదిబ్బ ఉండటంతో తడి,పొడి చెత్తను కలిపి వేస్తున్నారు.ఇక్కడున్న రెండు వసతి గృహాలతో పాటు గాంధీనగర్, ఆర్యనగర్ కాలనీల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

**వార్డుల్లో వీధులు అపరిశుభ్రం**

తాండూరు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి వార్డుల్లో వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. చెత్త తరలించేందుకు తెచ్చిన వాహనాలు కొన్ని పనిచేయడంలేదు. మురుగు కాల్వలు చెత్తతో నిండిపోతున్నాయి.

# పేరుకే చెట్టు.. పర్యావరణానికి చేటు



వికారాబాద్: పర్యావరణ రక్షణ, వాతావరణ సమతుల్యతలో వృక్షాల పాత్ర వెలకట్టలేనిది. ప్రభుత్వం సైతం హరితహారం పేరిట యేటా పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో కూడా 'కోనో కార్పస్' మొక్కలు నాటారు. కానీ పక్షులు వాలని, పశువులు తినని వృక్షాలుగా వీటికి గుర్తింపు ఉండటం ఆందోళనకరం. పర్యావరణానికి హాని కలిగించే వీటిని రాష్ట్ర వ్యాప్తంగా తొలగించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం జరిగిన శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**జిల్లా వ్యాప్తంగా 8 లక్షలు**

హరిత హారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 8 లక్షల కోనో కార్పస్ మొక్కలను పార్కులు, రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలు, చెరువు గట్లు తదితర ప్రాంతాల్లో నాటారు. అన్ని పట్టణాలు, ప్రైవేటు వెంచర్లు, పెట్రోల్ బంకులు, గ్రామాల్లో, గృహ సముదాయాల్లో ప్రస్తుతం పెరిగి పెద్దవై భారీ వృక్షాలను తలపిస్తున్నాయి.

**నిపుణులు ఏం చెబుతున్నారంటే..**

తక్కువ సమయంలో ఎక్కువ ఎత్తులో ఏపుగా కోనో కార్పస్ మొక్కలు పెరుగుతాయి. వీటివల్ల జరిగే నష్టం తెలుసుకుని విదేశాల్లో నిషేధించారు.

కోనో కార్పస్ వృక్షాల పుప్పొడి అత్యంత ప్రమాదకరమైంది. కరోనా సోకిన వ్యక్తి శ్వాసకోశ సమస్యలతో ఎలా ఇబ్బందులు పడతారో ఈ చెట్ల నుంచి పీల్చుకునే గాలి వల్ల అంతటి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

80 మీటర్ల లోతు వరకు వీటి వేర్లు వ్యాపించి భూగర్భ జలాలను పీల్చేస్తాయి.

జంతువుల మేతకూ ఉపయోగపడవు

కోనో కార్పస్ మొక్కలపై పక్షి వాలదు, జంతువుల మేతకూ ఉపయోగపడవు. ప్రజలకు లేని జబ్బులు తెచ్చి పెడతాయి. వీటిని ఎక్కడ ఉన్నా వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరాను.

గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభాపతి

**నాటడం నిలిపివేశాం..**

కోనో కార్పస్ మొక్కలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిసిన తరువాత జిల్లాలో వాటిని నాటడం నిలిపి వేశాం. పట్టణాల్లో పలు చోట్ల ఈ చెట్లను తొలగించి, వీటి స్థానంలో వేరే మొక్కలను నాటుతున్నాం.జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి

# ఉపాధిలో.. ప్రథమం

వికారాబాద్ : వలసలు నివారించి పల్లెల్లో నివసిస్తున్న ప్రజలకు పనులు కల్పించి వారికి ఉపాధి చూపించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. దీన్లో భాగంగా జిల్లా ముమ్మరంగా కూలీలకు పనులు కల్పించి ప్రథమంగా నిలవడంతో ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.ఇతర ప్రాంతాలకు ఆగిపోయిన వలసలు : జిల్లాలోని పరిగి, కుల్కచర్ల, దోమ, మోమిన్‌పేట, తదితర మండలాలకు చెందిన గ్రామీణులు ప్రతిసారి ఉపాధి కోసం ముంబయి, హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్రలోని పట్టణాలకు వెళ్తుంటారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించటంతో కూలీలు దీనివైపు మొగ్గుచూపారు. పనుల



కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లటం తగ్గించారు. ఈ ఆర్థిక సంవత్సరం గ్రామీణ అభివృద్ధి శాఖ దశల వారీగా 1.90 లక్షల మంది కూలీలకు పనులు కల్పించి రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిచింది.

ఇకముందూ కొనసాగిస్తాం: శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉపాధి హామీ పథకం పనుల అమలులో అనేక సూచికల్లో జిల్లా ప్రథమ స్థానం దక్కింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, సిబ్బంది ఎంతో సమన్వయంతో పనిచేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తాం.

ఈ సూచికల్లో గుర్తింపు2024-25లో 1,08,480 కుటుంబాలకు, 1,90,091మంది కూలీలకు దాదాపు 63.66 లక్షల పనిదినాలు కల్పించారు. 6,581 కుటుంబాలకు 100 రోజుల పనికల్పించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. 100రోజులకు సగటుగా 59 పనిదినాలు కల్పించడంతో మొదటి స్థానం దక్కింది.ప్రస్తుతం పని చేస్తున్న కూలీలు: (ఈనెల 22 నాటికి)28,824మంది.

# లక్ష్యానికి చేరువగా పంచాయతీలు

కోరుట్ల: జిల్లాలోని గ్రామపంచాయతీలు ఆస్తి పన్ను బకాయిల వసూళ్లలో దూసుకుపోతున్నాయి. మొత్తం గ్రామాల్లో శతశాతం తప్పనిసరిగా వసూలు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. రోజూ పన్ను బకాయిదారుల ఇళ్లకు వెళ్లి పూర్తిస్థాయిలో కట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 20 మండలాలు.. 385 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇప్పటివరకు జగిత్యాల మండలంలో అత్యధికంగా 101 శాతం పన్నులు వసూలు చేశారు. అత్యల్పంగా కొడిమ్యాల మండలంలో 93 శాతం వసూలయ్యాయి. జిల్లా మొత్తం కలిపి 97 శాతం వసూలు చేశారు. వారం రోజులు గడువు ఉండటంతో వంద శాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.



**కనిపించని అభివృద్ధి పనుల జాడ**

గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు 2024 జనవరి 31తో ముగియగా.. అప్పటి నుంచి గ్రామాల్లో నిధుల లేమితో అభివృద్ధి కుంటుపడటంతోపాటు మౌలిక వసతుల కల్పన కష్టంగా మారింది. గతంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు కేటాయించేవి. వీటితోపాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేవారు. అయితే పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం గడువు తీరడంతో ఏడాదికిపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. ఇంటి కుళాయి పన్నులు, ఇతర లైసెన్స్ ఫీజుల ద్వారా వచ్చే చాలిచాలనీ నిధులతోనే గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాల ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ట్రాక్టర్‌లలో డీజిల్ తదితర పనులు చేపడుతున్నారు. ఆయా నిధులనే మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించుకుంటున్నారు. ఈ నిధులు సరిపోకపోవడంతో కొన్ని పంచాయతీల అధికారులు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిచోట్ల ఏడాదికాలంగా అభివృద్ధి పనుల జాడ కనిపించకుండా పోయింది.

# పురం.. స్వచ్ఛత ప్రశ్నార్థకం!

సంగారెడ్డి : జిల్లాలోని పలు పురాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. చెత్త సేకరణలో నిత్యం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంప్ యార్డులు నిరుపయోగంగా మారడంతో చెత్త పేరుకుపోతోంది. స్వచ్ఛ పట్టణాలుగా మార్చాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. బొల్లారం, ఖేడ్‌లో మాత్రమే మెరుగ్గా ఉంది.

**అందరూ పొరుగుసేవల సిబ్బందే..**

ఖేడ్ పుర పరిధిలో పారిశుద్ధ్య విభాగం అధికారితోపాటు మరో 42 మంది కార్మికులున్నారు. అందరూ పొరుగుసేవల కిందే పనిచేస్తున్నారు. ఆటోల ద్వారా నిత్యం ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. జూకల్ శివారులోని చెత్తదిబ్బలో ఎరువులు తయారు చేస్తున్నారు. బొల్లారం పురాలికలో పారిశుద్ధ్య సమస్య లేదు. సేకరించిన చెత్తను పట్టణ శివారులోని గాంధీనగర్‌లో వేస్తున్నారు.

**జిల్లా కేంద్రం.. అపరిశుభ్రం**

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా మారింది. పారిశుద్ధ్య పర్యవేక్షకుడి పోస్టు మూణ్నెల్లుగా ఖాళీగా ఉంది. పట్టణంలోని వ్యాపార కూడళ్లతోపాటు కాలనీల్లో చెత్తాచెదారం కనిపిస్తోంది. ప్రధాన రహదారిపై మాత్రమే పూర్తిగా సేకరిస్తున్నారు. రోడ్డుపై చెత్త వేసే వారికి జరిమానా విధించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు.

**ఈగలు, దోమలు, దుర్వాసన..**

జిల్లాలోని పెద్ద పట్టణాల్లో ఒక్కటైన జహీరాబాద్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కార్యాలయంలో, క్షేత్రస్థాయిలో పనిచేసే వారు 224 మంది కార్మికులు అవసరం కాగా.. ప్రస్తుతం వంద పైచిలుకు మాత్రమే ఉన్నారు. పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ మరో పురపాలికలో పనిచేస్తున్నారు. వేరే అధికారికి ఇక్కడి బాధ్యతలు అప్పగించారు. ఈగలు, దోమలు, వాసనతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ

భగత్‌నగర్: యాసంగి 2024-25కు ధాన్యం కొనుగోలుకు అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. కొనుగోలు లక్ష్యం 3.6 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 336 కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇటీవల జిల్లాలోని పలు మండలాల్లో అకాల వర్షాలతో కొంత మేర పంట నష్టం వాటిల్లింది. కొనుగోలు లక్ష్యానికి కొంత గండిపడే అవకాశముంది. సాధారణంగా వేసవిలో రైతులు దొడ్డు రకం ధాన్యం పండిస్తారు. సన్నాలు వేస్తే ధాన్యం మర ఆడించిన సమయంలో ముక్కలవుతాయి. ఈ నేపథ్యంలో వేసవిలో సన్నాలు కొనుగోలు ప్రభుత్వానికి భారమే.

**336 కేంద్రాలు..**

యాసంగి ధాన్యం కొనుగోలు చేయడానికి జిల్లాలో 336 కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఐకేపీ-48, పాక్స్-239, డీసీఎంఎస్-45, హాకా-4ల ఆధ్వర్యంలో ప్రారంభించబోతున్నారు. వీటిలో సన్న, దొడ్డు రకాల వడ్లను కొనుగోలు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు కావాల్సిన ఏర్పాట్లు చేసేందుకు ఆయా శాఖల మధ్య సమన్వయంతో పని చేయబోతున్నారు.

సాధారణంగా యాసంగిలో అకాల వర్షం భయం వెంటాడుతుంది. ఒక్కోసారి ఆరుగాలం శ్రమ వరదపాలు అయ్యే అవకాశముంటుంది. ప్రభుత్వ ఖర్చులతో వరికుప్పలపై కప్పడానికి టార్పాలిన్లను సమకూర్చు



తున్నారు. కొనుగోలు కేంద్రాలకు 7472 టార్పాలిన్ అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 4955 సమకూర్చుకున్నారు. మిగతా వాటిని సమకూర్చుకునే పనిలో ఉన్నారు. సన్నరకాలను కొలిచేందుకు గ్రైన్ కాలిఫర్లు హస్క్ రిమూవర్లు అందుబాటులో ఉన్నాయి.

**సన్నవి కొలవడమే సమస్య**

సన్న బియ్యాన్ని నిర్ధారించడానికి వడ్లను హస్క్ రిమూవర్‌తో పొట్టి తొలగించి, గ్రెయిన్ కాలిఫర్‌తో గింజను కొలుస్తారు. గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కన్న తక్కువ, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్న తక్కువ ఉండాలి. ఇది వ్యవసాయాధికారులు నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. ఒక్కో వ్యవసాయాధికారికి అయిదారు కేంద్రాల బాధ్యత అప్పగిస్తున్నారు. ఆయా కేంద్రాలకు వెళ్లి నిర్ధారణ చేయడం ఆలస్యమవుతోంది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి కాలహారణం జరగకుండా చూడాల్సిన అవసరముంది.

లక్ష్యం 3.6 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 2,66,896 ఎకరాల్లో వరి సాగు చేశారు. దొడ్డు రకం 1,99,051 ఎకరాల్లో, సన్నరకపు 67,845 ఎకరాల్లో సాగు చేశారు. దొడ్డు రకం 4,57,817 మెట్రిక్ టన్నులు, సన్నరకం 1,28,906 ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.స్థానిక వినియోగానికి దొడ్డు బియ్యం 1,82,871 మెట్రిక్ టన్నులు, సన్నరకం 43,842 మెట్రిక్ టన్నులు వినియోగమవుతుందని ఊహించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు దొడ్డు ధాన్యం 2,74,946 మెట్రిక్ టన్నులు, సన్న రకం 85,054 మెట్రిక్ టన్నులు తీసుకొచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# కాగితాల్లో నిషేధం.. అమలులో నిర్లక్ష్యం

జగిత్యాల : రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బీటీ-3 పత్తిని సాగు చేయవద్దని పేర్కొన్నా.. గత వానాకాలంలో ఈ నిషేధం అమలు కాలేదు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బీటీ-3 విత్తనాలు పండించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విత్తనాల పట్ల రైతుల ఆసక్తినిబట్టి పలు ప్రాంతాల్లో బీటీ-2 విత్తనాలను కూడా బీటీ-3 పేరిట అమ్మినట్లు గుర్తించారు. సాధారణంగా బీటీ-3 విత్తనాలతో పండించిన పంటపై గ్లైఫోసేట్ గడ్డిమందును పిచికారీ చేసినా పంట మొక్కలకు ఎలాంటి హాని జరగకపోగా కలుపు పూర్తిగా తొలగిపోతోంది కానీ.. బీటీ-2 విత్తనాలను బీటీ-3 పేరిట సాగుచేసి గ్లైఫోసేట్‌ను పిచికారీ చేస్తే పంటంతా ఎండి తీవ్రంగా నష్టపోతారు. నిషేధిత గ్లైఫోసేట్ గడ్డిమందును చాలామంది వాడుతున్నారు. గ్లైఫోసేట్ను వాడినప్పుడు మనుషుల ఆరోగ్యాలు దెబ్బతినడంతోపాటు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**పకడ్బందీ చర్యలు అవసరం**

ముందుగా ఆవిష్కరించిన బీటీ-1 విత్తనాలు తలనత్త, గులాబీరంగు, సెనగపచ్చ పురుగును తట్టుకున్నాయి. బీటీ-2 విత్తనాలు లద్దెపురుగులను కూడా తట్టుకునే శక్తిని కలిగి ఉన్నాయి. బీటీ-3 వీటన్నింటితోపాటు కలుపు నివారణ రసాయనాన్ని తట్టుకొని అధిక దిగుబడి ఇస్తుందని పేర్కొన్నా.. శాస్త్రీయంగా మనదేశంలో నిరూపణ కానందున సాగు చేయొద్దని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. గత పంట కాలాల్లో బీటీ విత్తనాలపైనా చీడపీడలు ఆశించటం బీటీ విత్తనాల సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.

కొన్నిచోట్ల బీటీ విత్తుల పేరిట నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోని పత్తిగింజలకు రంగులు పట్టించి అందమైన కవర్లలో, డబ్బాల్లో నింపి ప్రముఖ కంపెనీల లేబుళ్ల పేరిట గుట్టుగా విక్రయాలు సాగిస్తారు. జిన్నింగ్ మిల్లుల్లో నుంచి పత్తిగింజలను అతి తక్కువ ధరకు తీసుకొచ్చి విత్తనాలుగా చలామణి చేసినప్పుడు అధిక లాభం వస్తుండటంతో మోసగాళ్లు నకిలీ విత్తనాల చలామణి చేపడుతున్నారు. లాభం ఎక్కువగా వస్తుందని వ్యాపారులు, జేబులు నిండుతాయని కొన్నిచోట్ల అధికారులు సహకరిస్తుండటంతో నకిలీ విత్తనాలు యథేచ్ఛగా రైతుల క్షేత్రాలకు చేరుతున్నాయి. నకిలీ విత్తనాల మొక్కలు మొలిచి ఎదిగినా కాయలు అతితక్కువగా వచ్చి దిగుబడి సగానికి పడిపోతుంది. చీడపీడల ఉద్ధృతి పెరిగి సస్యరక్షణ ఖర్చు పెరగటంతో ఏమాత్రం గిట్టుబాటు కాదు. పల్లెల్లో జీరోగా విత్తనాలను అమ్మటం, కొన్ని దుకాణాల్లో బిల్లులు ఇవ్వనందున రైతులు నష్టపోయిన సందర్భాల్లో కనీసం ఫిర్యాదుకు కూడా నోచుకోవటం లేదు. వచ్చే వానాకాలంలో వరికి బదులుగా పత్తి తదితర ఆరుతడి పంటల సాగు పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినందున వ్యవసాయశాఖ, పోలీసు అధికారులు ఇప్పట్నుంచే దృష్టిసారించి బీటీ-3 విత్తనాలు, నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాల్సి ఉంది.

# ఎండకు ఎండాల్సిందే



హైదరాబాద్: వేసవి సమీపిస్తున్న వేళ ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అవసరమైన బస్‌షెల్టర్లు లేక ఎండలో నిరీక్షిస్తున్న పరిస్థితి. పేరుకే ఉన్న కొన్ని ఏసీ బస్‌షెల్టర్లు మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల విద్యుత్తు సరఫరా లేక పాడైన ఫ్యాన్లు, ఏసీలు దర్శనమిస్తున్నాయి. గ్రేటర్‌లో 2800కి పైగా బస్సుల్లో నిత్యం 20లక్షల మంది ప్రయాణాలు సాగిస్తుండగా 2200 బస్‌షెల్టర్లకు 1370 మాత్రమే ఉన్నాయి. 200 ప్రాంతాల్లో నిర్మించడం తప్పనిసరి అంటూ గ్రేటర్ ఆర్టీసీ అధికారులు జీహెచ్ఎంసీకి విన్నవించినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

**ఆరు బయటే నిరీక్షణ..**

మెహిదీపట్నంలో రైతుబజార్ వైపు ఉన్న బస్‌షెల్టర్లలో విరిగిన కుర్చీలు, బల్లలే దర్శనమిస్తున్నాయి. ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రయాణికులు ఎక్కడ బస్సు ఎక్కుతారో సర్వే చేయకుండా బస్‌షెల్టర్లు నిర్మించడంతో చాలావరకు నిరుపయోగంగా మారిపోయాయి.

హిమాయత్‌నగర్ రోడ్డు, నారాయణగూడ, కాచిగూడ, అమీర్‌పేట, కోఠి, ఉప్పల్, బీహెచ్ఈఎల్ మార్గంలో అవసరమైన చోట షెల్టర్లు లేవు. మరోవైపు హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, సోమాజిగూడ ప్రాంతాల్లో అవసరానికి మించి నిర్మించారు.

లింగంపల్లి నుంచి చందానగర్ మార్గంలోనూ కొత్తగా నిర్మించాలనే డిమాండ్లు ఉన్నాయి. ఫలక్‌నుమా ఇంజిన్‌బౌలి మార్గంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఏసీ బస్‌షెల్టర్ల పరిస్థితి..

డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ (డీబీఎఫ్‌వోటి) పద్ధతిలో ఏసీ బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎస్పీరోడ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, మలక్‌పేట్‌లోని ఏసీ బస్‌షెల్టర్లలో నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి. డిజైన్‌లోపం ఉండటం, వచ్చే బస్సులు కనిపించకపోవడంతో షెల్టర్ బయటే వేచి చూస్తున్నారు. కొన్నిచోట్ల దుకాణాలకు అద్దెకిచ్చారే తప్ప నిర్వహణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కూకట్‌పల్లిలో రాత్రయితే మందుబాబులు ఇందులో తిష్ఠవేస్తున్నారు.

# జన సాంద్రత.. నేర తీవ్రత

హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో నేరాల సంఖ్య పెరుగుతోంది. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గచ్చిబౌలి ఠాణాలో జనవరి, ఫిబ్రవరిలో 336 కేసులు నమోదయ్యాయి. సగటున రోజుకు 5 రికార్డయ్యాయి. నార్సింగి ఠాణా పరిధిలో 2 నెలల్లో 389 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం వల్లే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. నమ్మకద్రోహం (చీటింగ్), ఆర్థిక తగాదాలు, ఉద్యోగ మోసాలు, అదృశ్యం, రోడ్డు ప్రమాదాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. విభజిస్తేనే తగ్గుదల గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండేది. కొత్తగా ఫిల్మ్‌నగర్, మధురానగర్, బోరబండ ఠాణాలు రావడంతో కేసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఐటీ కారిడార్‌లో కొత్తగా కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఠాణాలను ప్రతిపాదించారు. అవి వస్తే నిఘా పెరిగి నేర నియంత్రణ సులువుగా మారుతుందని అధికారులు తెలిపారు.



జనసాంద్రత అంతర్జాతీయ, దేశీయ సంస్థలు.. భిన్న ప్రాంతాల ప్రజలు.. అత్యధిక జనసాంద్రత.. వీటితోపాటే ఆర్థిక వివాదాలు.. సైబర్ నేరాలు ఐటీ కారిడార్‌లో ఎక్కువ నేరాల నమోదుకు కారణమవుతోంది. ఇక్కడితో పోలిస్తే జగద్గిరిగుట్ట, రాజేంద్రనగర్ ఠాణాల పరిధిలో జనసాంద్రత ఎక్కువ. ఇతర రాష్ట్రాల కూలీలు ఉంటున్నారు. ఇలాంటి చోట్ల సైబర్ నేరాలు, ద్విచక్రవాహనాల చోరీలు, ఆర్థిక తగాదాలు తక్కువగా ఉంటాయి. ఐటీ కారిడార్ పరిధిలోని మూడు ఠాణాల పరిధిలో అత్యధికులు విద్యావంతులు. ఏ సమస్య వచ్చినా పోలీసులను ఆశ్రయిస్తుండటంతో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతంలో ఫిర్యాదు దశలో రాజీ ప్రయత్నాలు జరిగేవని హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 2 వేల ఐటీ సంస్థలు పనిచేస్తుంటే సుమారు 95 శాతానికి పైగా ఐటీ కారిడార్ కేంద్రంగానే నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 5 లక్షల మందికిపైగా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో నేరాలివీ..

గచ్చిబౌలి 336 మాదాపూర్ 314 రాయదుర్గం 173 నార్సింగి 389

# కోర్టు చెప్పినా..మురుగు పరుగే!



హైదరాబాద్ : ఏడాది కిందట.. అంటే మార్చి 19, 2024న.. హైకోర్టు నియమించిన ఇద్దరు సభ్యుల అడ్వకేట్ కమిషన్ నగరంలోని 13 చెరువులను తనిఖీచేసింది. ఆక్రమణలు, కలుషిత నీరు, నిర్మాణ వ్యర్థాల డంపింగ్ వంటి సమస్యలను గుర్తించింది. చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. 4 వారాల్లో చర్యలు తీసుకోవాలని గడువు నిర్దేశించినా బల్దియాలో చలనం లేదు. మురుగునీటిని దారి మళ్లించేందుకు చేపట్టిన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నిర్మాణ వ్యర్థాల డంపింగ్, ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. చందానగర్‌లోని గంగారం చెరువు ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు.

**ఏడాది పొడవునా మత్తడి**

అడ్వకేట్ కమిషన్ తనిఖీచేసిన చెరువుల్లో.. దుర్గంచెరువు, మేడికుంట, సున్నంచెరువు, బోయిన్‌చెరువు, అంబీర్‌చెరువు తదితర తటాకాలు ఏడాది పొడవునా మత్తడి పోస్తుంటాయి. వాటిలోకి రోజూ లక్షలాది లీటర్ల మురుగు చేరుతోంది. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు, మూసాపేట మైసమ్మ చెరువు, కైత్లాపూర్‌లోని కాముని చెరువు, ముళ్లకత్వ చెరువు, హుస్సేన్‌సాగర్, ఇతరత్రా తటాకాలదీ అదే పరిస్థితి.

**తనిఖీ చేసిన తటాకాలివే:** మాదాపూర్‌లోని దుర్గం చెరువు, కూకట్‌పల్లిలోని సున్నంచెరువు, హైదర్‌నగర్‌లోని అంబీర్ చెరువు, నానక్‌రాంగూడలోని మేడికుంట, గౌలిదొడ్డిలోని గోసాయ్‌కుంట, నల్లగండ్లలోని పెద్దచెరువు, చందానగర్‌లోని గంగారం పెద్దచెరువు, సరూర్‌నగర్ బైరామల్‌గూడలోని మద్దెలకుంట, ఉప్పల్‌లోని నల్లచెరువు, ఫీర్జాదిగూడలోని పెద్దచెరువు, దుండిగల్‌లోని చిన్నదామర చెరువు, బోయిన్‌పల్లిలోని బోయినచెరువు, అల్వాల్‌లోని చిన్ననారాయణుని చెరువు.

**ఇప్పుడు పరీక్షిస్తామంటున్న బల్దియా**

అడ్వకేట్ కమిషన్ తనిఖీలు జరిగిన ఏడాదికి.. ఆయా చెరువుల్లో నీటి నాణ్యతను పరీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'నీరి'తో ఒప్పందం చేసుకుంటున్నామని, అందుకుగాను రూ. 55లక్షలు నీరి సంస్థకు చెల్లించాలని నిర్ణయించామని జీహెచ్ఎంసీ చెబుతోంది.

**ప్రస్తుతం ఇదీ పరిస్థితి**

దుర్గం చెరువు పరిస్థితి మారలేదు. మురుగు చెరువులో కలవకుండా తీసుకున్న చర్యలు ఫలించలేదు. ఇనార్బిట్ మాల్ వద్ద మురుగు కలుస్తోందని స్థానికులు గగ్గోలుపెడుతున్నారు.

గంగారం పెద్ద చెరువును ఆక్రమించే ప్రయత్నాలు ఆగట్లేదు. తాజాగా కొందరు నిర్మాణ వ్యర్థాలు పోసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తంచేశారు.

నానక్‌రాంగూడలోని మేడికుంట ఏడాదిలో ఎప్పుడు చూసినా నిండుగా కనిపిస్తుంటుంది. డ్రైనేజీ కలవడంతోనే అని స్థానికులు చెబుతున్నారు. చెరువు బఫర్‌జోన్‌లో లేబర్ షెడ్లు ఏర్పాటయ్యాయి.

గౌలిదొడ్డిలోని గోసాయ్‌కుంటలో కొంత శిఖం పట్టా భూమి ఉంది. బఫర్ జోన్‌లో నిర్మాణాలున్నాయి. ఓ ప్రముఖ స్థిరాస్తి సంస్థ ప్రహరీ నిర్మించింది. పలు ఇతర ఆక్రమణలూ వచ్చాయి.

హైదర్‌నగర్‌లోని అంబీర్ చెరువు.. కొత్త ఆక్రమణలు లేకపోయినా మురుగును దారి మళ్లించే పనులు జరగలేదు.

బోయిన చెరువు.. కొత్త ఆక్రమణలు లేవు. మురుగును దారి మళ్లించే పనులు పూర్తయినా, నీటి మట్టం తగ్గపోవడంతో మురుగు కలుస్తోందనే విమర్శలున్నాయి.

చిన్ననారాయణుని చెరువులో మురుగుకాలువ పైపులైను నిర్మాణం జరుగుతున్నప్పుడే ఆక్రమణలు జరిగాయి. కట్టడాలు వెలిశాయి. జానకినగర్, ఆనంద్‌నగర్, ఇతరత్రా కాలనీలవైపు పెద్దఎత్తున నిర్మాణ వ్యర్థాలతో చెరువును కప్పేశారు.

# తీరు మారితే.. తీరుతుంది దాహార్తి

తాండూరు, పరిగి: ప్రజల దాహార్తిని తీర్చిడానికి ప్రభుత్వం పంప్‌హౌస్‌లు, తాగునీటి ప్రాజెక్టులు చేపడుతోంది. వీటి నిర్వహణ సక్రమంగా ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి తనిఖీలు చేపట్టక పోవడం, అవసరమైన మరమ్మతులు నిర్వహించక పోవడం తదితర కారణాలతో పథకాలు వృథాగా మారుతున్నాయి. నిదర్శనంగా నిలుస్తున్నాయి ఈ పంప్‌హౌస్‌లు.

**కాగ్నా నది ఆధారంగా రెండు ఏర్పాటు**

తాండూరు పట్టణానికి కాగ్నానది ఆధారంగా తాగునీటిని సరఫరా చేసే రెండు పంప్‌హౌస్‌లు గడచిన మూడేళ్లకు పైగా మూత పడ్డాయి. వినియోగంలోకి తీసుకు వస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. పట్టణంలోని 36 వార్డుల్లో 14వేల గృహాల్లో నివాసం ఉండే 71,008 జనాభాకు నిత్యం 8.5 ఎం.ఎల్.డి (మిలియన్ లీటర్స్ పర్ డే) తాగు తాగునీరు అవసరం. కానీ 6.5 ఎం.ఎల్.డి.మాత్రమే సరఫరా అవుతోంది.



**రహదారి నిర్మాణం పేరుతో పైప్‌లైన్ తొలగింపు**

కాగ్నానది వంతెన సమీపం నుంచి కొడంగల్ నియోజకవర్గం గ్రామాలు, యాలాల మండలంలోని 39 గ్రామాలకు కలిపి తాగునీటిని సరఫరా చేయడానికి 1999లో రూ. 6.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పంప్‌హౌస్ తాత్కాలికంగా మూత పడింది. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌను గతేడాది వినియోగంలోకి తీసుకు వచ్చి నీటిని సరఫరా చేశారు. అయితే తాండూరు నుంచి కొడంగల్ వైపు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల నేపథ్యంలో నీటి సరఫరా పైపులైన్‌ను తొలగించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. పనులను పూర్తి చేసి కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే పంప్‌హౌస్ వినియోగంలోకి వస్తుంది. ప్రజలకు తాగునీటి సరఫరా జరిగి ఎద్దడి సమస్య ఉండదు. ఇందుకోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

**సుదీర్ఘ కాలంగా సేవలు**

1953లో పాత తాండూరు కాగ్నానది వారగా అప్పటి ప్రజల అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ నుంచి నాలుగేళ్ల కిందటి వరకు సరిపోను నీటి సరఫరా జరిగింది. నిర్వహణ సవ్యంగా లేక పోవడంతో మరమ్మతుకు వచ్చింది. పట్టణానికి 24 గంటల పాటు నీటిని సరఫరా చేసే పంప్ ఆధారిత ఇన్‌ఫిల్టరేషన్ బావులు ఉన్నాయి. యాలాల మండలం బెన్నూరు శివారు కాగ్నానది వారగా తాండూరు పట్టణానికి నీటిని సరఫరా చేసే మరో పంప్ హౌస్‌ను 2005లో రూ. 5.80 కోట్లతో నిర్మించారు. నిర్వహణ సవ్యంగా లేక నిరుపయోగమైంది. ప్రస్తుత వేసవిలో ఈ రెండు పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకు వస్తే 2ఎం.ఎల్.డి. నీటి సరఫరా జరిగి ప్రజల దాహార్తి తీరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# కన్నేసి.. కలిపేసి



హైదరాబాద్ : బాహ్యవలయ రహదారి పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని ఆక్రమించేస్తున్న కొందరు అక్రమార్కులు.. కొద్దినెలల నుంచి శంషాబాద్ సమీపంలోని అమ్మపల్లి గ్రామంలో మిగులు భూముల(సర్‌ప్లస్)పై కన్నేశారు. సర్వేనంబర్ 19లో వంద ఎకరాలకుపైగా సర్‌ప్లస్ భూములుండగా... అదే సర్వే నంబర్‌లో ఇరువైపులా ప్రైవేటు పట్టాలుండడంతో వాటి పక్కనే ఉన్న మిగులు భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. ఇప్పటికే రూ. 600కోట్ల విలువైన 30 ఎకరాలను ఆక్రమించుకున్నారని సమాచారం. ఈ భూములు రాళ్లగూడ ఓఆర్ఆర్ జంక్షన్‌కు రెండు కి.మీ.ల దూరంలో ఉండడంతో ప్లాట్లను వేగంగా అమ్ముకుంటున్నారు.

**నిబంధనలకు విరుద్ధం..**అమ్మపల్లి గ్రామంలో లేఅవుట్లు వేయడం, భవనాలు నిర్మించడం జీవో నంబర్ 111ను ఉల్లంఘించడమే. ఈ జీవో ప్రకారం శంషాబాద్ మండలమంతా బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టకూడదు. ఇల్లు కట్టుకోవాలంటే ప్రైవేటు పట్టాభూమి విస్తీర్ణంలో 90శాతం భూమిని వదిలేసి కట్టుకోవాలి. ఇందుకు భిన్నంగా కొన్నిచోట్ల బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. ఆక్రమించిన భూముల్లో ఫంక్షన్ హాళ్లను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ అంశంపై రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డిని వివరణ కోరగా.. సర్వేనంబర్ 19లో మిగులు భూములతో పాటు కొన్ని ప్రైవేటు పట్టాభూములు న్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. **పట్టాభూములేనంటూ విక్రయాలు..** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ గ్రామపరిధి అమ్మపల్లి రెవెన్యూ సంఖ్య 19లో వంద ఎకరాలకు పైగా సీలింగ్ సర్‌ప్లస్ భూములున్నాయి. ఏళ్లుగా ఇవి ఖాళీగా ఉండటంతో కొందరు వీటిని సొంతం చేసుకునేందుకు 9నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. విమానాశ్రయానికి 10 కి.మీ దూరంలో ఉండడంతో లే-అవుట్లు వేసి విక్రయిస్తే కొన్నవారు సులభంగా ఇళ్లు కట్టుకోవచ్చంటూ ప్రచారం చేస్తున్నారు. మిగులు భూముల్లో అనధికారికంగా సాగు చేసుకుంటున్న రైతులకు ఎంతోకొంత ముట్టజెప్పి ఆ స్థలాలనూ ఆక్రమించారు. ప్రహరీలు నిర్మించి ఈ భూములు తమవేనంటూ బోర్డులు పెడుతున్నారు.




హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. దుబ్బాకలో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. స్థల పరిశీలనకు దుబ్బాక వెళ్లాలని సీఎంవోకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు హబ్సీపూర్-లచ్చపేట్ 2 వరుసల రోడ్డుకు రూ.35 కోట్లు మంజూరు చేశారు. హామ్ మోడల్‌లో ఆ రోడ్డును అభివృద్ధి చేస్తామని అధికారులు తెలిపారు.
అడిగిన వెంటనే స్పందించిన రేవంత్‌రెడ్డికి దుబ్బాక నియోజకవర్గ ప్రజల పక్షాన కొత్త ప్రభాకర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.




హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ కేసులో నటి విష్ణుప్రియ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. మియాపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని నటి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్ఐఆర్ కొట్టివేయడానికి, దర్యాప్తుపై స్టే విధించేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దర్యాప్తునకు సహకరించాలని విష్ణుప్రియను ఆదేశించిన కోర్టు.. చట్ట ప్రకారం ముందుకెళ్లాలని పోలీసులకు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం చేసిన పలువురు నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

## గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా విడుదల




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 66 మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం శుక్రవారం రూ.3 కోట్ల 30 లక్షల ఎక్స్ గ్రేషియాను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేశారని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఒక ప్రకటనలో తెలిపారు.
సీఎం సూచన మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆర్థిక, ప్రణాళిక) కే.రామక్రిష్ణా రావుతో సమన్వయము చేసి నిధులు విడుదల చేయించానని అనిల్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 28 మంది, జగిత్యాల 19, కామారెడ్డి 9, నిర్మల్ 7, మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలలో ఒక్కొక్కరి చొప్పున 66 మంది ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని వివరించారు. గతంలో 103 మందికి రూ.5 కోట్ల 15 లక్షలు విడుదల చేశారని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 169 మందికి రూ.8 కోట్ల 45 లక్షలు చెల్లింపు జరిగిందని అనిల్ వివరించారు.

## పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా కుదరదు: కేంద్రం




ఢిల్లీ: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో.. ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్ర జలశక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## రేవంత్ రెడ్డి చేతల్లో చూపించారు.. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశంసలు



నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ శాసనసభలో ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోయే తీర్మానం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటలను చేతల్లో నిరూపించారని తమిళనాడు సీఎం స్టాలిన్ కొనియాడారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ శాసనసభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎక్స్?వేదికగా స్పందించారు. న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ సరైన రీతిలో పునర్విభజన కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారని తమిళనాడు సీఎం పేర్కొన్నారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయని, ఇది ఆరంభం మాత్రమేనని.. హైదరాబాద్‌లో ఐక్యకార్యాచరణ సమితి రెండో సమావేశం నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు అదే బాటలో నడుస్తాయని తమిళనాడు సీఎం అభిప్రాయపడ్డారు. పునర్విభజన విషయంలో తమిళనాడును అనుసరిస్తూ, ఈ చర్యను ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ భవిష్యత్తును అధర్మ మార్గాన ఒక ప్రాంతానికి అన్యాయం చేసే రీతిన రాసేందుకు ప్రయత్నించే ఎవరినీ అనుమతించబోమని స్టాలిన్ స్పష్టం చేశారు.

## 400 చదరపు అడుగుల్లో ఇల్లు.. ప్రతి దశను ఫొటోలు తీయాలి..

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పాటించాల్సిన పలు గైడ్ లైన్లను ఖరారు చేస్తూ హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వీపీగౌతమ్ సర్క్యులర్ జారీ చేశారు. వీటిని కలెక్టర్లకు పంపారు. ఇంటి నిర్మాణం కోసం.. ముగ్గు పోసిన తర్వాత బేస్ మట్టం పనులు ఆరంభించే ముందు స్థలం ఫొటో తీసి, దాన్ని ఇందిరమ్మ యాప్ లో మొబైల్ ఫోన్ ద్వారా జియో కోఆర్డినేట్స్ నమోదు చేయాలని ఎండీ సూచించారు. ఇంటి నిర్మాణ వైశాల్యం 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఉండాలని.. రెండు గదులు, ఒక వంటగది, బాత్రూంతో సహా ఇంటిని నిర్మించాలని తెలిపారు. ప్రతి దశలోనూ ఫొటోలు తీసి మొబైల్ ద్వారా ఇందిరమ్మ అప్ తో అప్లోడ్ చేయాలని, వీటి ఆధారంగానే లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. పాత ఇంటిని అనుకోనిగాని, ఇప్పటికే ఉన్న ఇంటికి అదనపు గదులుగాని, కొంతవరకు కూల్చి వేసిన వాటికిగాని ఈ స్కీమ్ ద్వారా నిర్మాణం చేయరాదని వివరించారు. ఈ అంశాలను కలెక్టర్లు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. గతంలో నిర్మాణం ప్రారంభించి కొంతవరకు నిర్మించిన ఇండ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇందిరమ్మ స్కీమ్ మంజూరు చేయరాదన్నారు.
ఇండ్లను కలిపి కట్టుకోవడానికి అనుమతించరాదని, ఒకటే ఫ్యామిలీలో ఉన్న కుటుంబ సభ్యులకు ఒక ఇల్లు మాత్రమే ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులందరికీ కలెక్టర్లు సరైన ఆదేశాలు ఇవ్వాలని ..గైడ్ లైన్స్ తప్పనిసరిగా పాటించే లాగా చూడాలన్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లను ఎండీ గౌతమ్ ఆదేశించారు.




జిన్నారం: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద రీతిలో ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. తల్లి తీవ్రమైన కడుపునొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. స్థానిక సీఐ నరేశ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత తమ ముగ్గురు పిల్లలు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)తో కలిసి నివాసముంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు.
చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తిన్నారు. భోజనం తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చాడు. రాజిత తలుపులు తెరవగా.. పిల్లలు నిద్రపోతున్నారు.
శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా.. అప్పటికే ముగ్గురూ మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



చెన్నయ్యది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండ లం మెడకపల్లి. ఉపాధి కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. చిన్నారుల మృతిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి..!: దివ్యాంగ దంపతుల విజ్ఞప్తి

**హనుమకొండ: వారు పుట్టుకతోనే దివ్యాంగులు.. అయినా వైకల్యం శాపమని ఏనాడు అనుకోలేదు . అందరిలా నడవలేకపోతున్నామని బాధపడలేదు. ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమించారు. రెండేళ్ల క్రితం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఒకరికొకరు తోడుగా కాలం వెళ్లదీస్తున్నారు. సాఫీగా సాగుతున్న వీరి జీవితంలో అనుకోని సంఘటన ఎదురైంది. భార్యకు ప్రమాదవశాత్తు కాలు విరగడంతో పూర్తిగా మంచానికే పరిమితమైంది. ఎవరిపై ఆధారపడకుండా జీవనం సాగించిన వీరు.. ఇప్పుడు దాతల సాయం కోరుతున్నారు.**




తాజా భూకంపం తీవ్రతకు మయన్మార్ రాజధాని నేపిడాలోని 1,000 పడకల ఆసుపత్రి కుప్పకూలింది. దీంతో అత్యధికంగా క్షతగాత్రులు ఇక్కడే ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఈ ఆసుపత్రికి ఇంకా పేరు పెట్టలేదు. ఈ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఇక్కడ అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఓ ఆంగ్లవార్తా సంస్థ కూడా పేర్కొంది. చాలా మంది తమ ఆత్మీయుల కోసం శిథిలాల్లో గాలింపు కొనసాగిస్తున్నారు. మయన్మార్ దేశవ్యాప్తంగా చాలా చోట్ల భవనాలు, పాత వంతెనలు కుప్పకూలినట్లు వార్తలొస్తున్నాయి. ఇవాళ ఉదయం మయన్మార్, థాయ్‌ల్యాండ్ సహా చైనా, భారత్, వియత్నాం తూర్పు ఆసియా దేశాల్లో 7.7, 6.4 తీవ్రతతో రెండు భూకంపాలొచ్చాయి. ఫలితంగా థాయ్‌ల్యాండ్, మయన్మార్‌లో భారీగా ఆస్తినష్టం చోటు చేసుకొంది. మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మాండలే అనే ప్రదేశంలో మసీదు కూలి దాదాపు 20 మంది చనిపోగా.. టవుంగూలో పునరావాస కేంద్రం ధ్వంసమై మరో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మయన్మార్‌లోని సైనిక పాలకులు అంతర్జాతీయ సమాజం సాయం చేయాలని కోరారు. ఈ మేరకు మిలటరీ జుంటా ఓ ప్రకటన విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా అత్యవసర పరిస్థితి ప్రకటించింది. నేపిడాలో క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న ఆసుపత్రిని మిలటరీ చీఫ్ మిన్ ఆంగ్ లయాంగ్ సందర్శించారు.

**బ్యాంకాక్‌లో ఇద్దరి మృతి..** భూకంపం కారణంగా బ్యాంకాక్‌లో ఇద్దరు చనిపోయారు. నగరంలో కుప్పకూలిన 30 అంతస్తుల భారీ భవనం కింద 43 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల కోసం దీనిని నిర్మిస్తున్నారు. మరోవైపు ఆ దేశ స్టాక్ ఎక్స్ఛేంజి కార్యకలాపాలను సస్పెండ్ చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ఇక తొలిసారి ప్రకంపనలు రాగానే బ్యాంకాక్‌లో మెట్రో సేవలను నిలిపివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పినట్లైంది. రెండో సారి ప్రకంపనలకు ఏకాంగా మెట్రో రైళ్లు కూడా ఊగిపోయాయి. చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో కూడా తీవ్ర స్థాయిలోనే భూకంపం వచ్చింది. మేఘాలయ ఈస్ట్‌గారో హిల్స్‌లో 4 తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోనూ 7.3 తీవ్రతతో భూమి కంపించినట్లు తెలుస్తోంది.

## అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ..!

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. కథనాల ప్రకారం.. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్శిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఇక, గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660